



# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 280 | శుక్రవారం 07 నవంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## నల్లగొండ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం




## లివ్ఇన్ రిలేషన్ డ్రగ్స్ తీసుకున్న జంట ఓవర్ డోస్‌తో యువకుడు మృతి



## బీజాపూర్ ఎన్‌కౌంటర్

### మరో నలుగురు మావోయిస్టులు మృతి



## తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం..

### విజయ డెయిరీ మాజీ చైర్మన్ జానకిరామయ్య కన్నుమూత




## తెలంగాణ భక్తులకు తిరుమల దేవస్థానం శుభవార్త..

### ఈ మూడు పట్టణాల్లో టీటీడీ ఆలయాలు



## చేవెళ్ల ఘటనతో రవాణా శాఖ అలర్ట్..

### త్రిముఖ వ్యూహంతో కొత్త రూల్స్..!



## ‘ఈ చీమలతో బ్రతకటం నావల్ల కాదు..’

# చీమల భయంతో వివాహిత సూసైడ్



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** కొందరికి ఎత్తైన భవనాలు చూస్తే భయం.. ఇంకొందరికి లోతైన బావులను చూస్తే భయం.. మరికొందరికి చీకటి చూస్తే భయం.. ఇలా చాలా మంది కొన్ని కొన్ని వస్తువులను, ప్రాంతాలను, జంతువులను చూస్తే భయంతో వణికిపోతుంటారు. ఆ క్షణంలో వారు ఏం చేస్తారో కూడా అర్థం కాదు. స్పృహతప్పి పడిపోవటం, కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోవటం కూడా జరుగుతుంది. తాజాగా.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకరమైన ఘటన చోటు చేసుకుంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శర్వా హెూమ్స్‌కు చెందిన మనీషా (25) అనే వివాహిత.. చీమల ఫోబియా కారణంగా ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది.

కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మనీషా కొంతకాలంగా చీమల ఫోబియాతో బాధపడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రిలో చూపించినా ఫలితం లేకపోయింది. ఈనెల 4వ తేదీన సాయంత్రం భర్త శ్రీకాంత్ ఆఫీసుకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి.. బెడ్‌రూమ్ తలుపు లోపల గడియ పెట్టి ఉంది. స్థానికుల సహాయంతో తలుపులు తెరిచి చూడగా.. మనీషా చీరతో ఉరి వేసుకుని కనిపించింది.

# ప్రభుత్వ స్కూళ్లలో 2,837 ఉద్యోగాలు



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను పటిష్టం చేయడానికి, కంప్యూటర్ టీచర్లు (ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లు) లేదా బోధకులను నియమించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఈ నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం, రాష్ట్రంలో ఐదు లేదా అంతకంటే ఎక్కువ కంప్యూటర్లు కలిగిన పాఠశాలలు 2,837 ఉన్నట్లు గుర్తించారు. ఈ కంప్యూటర్ ల్యాబ్‌లను పూర్తిగా ఉపయోగించుకోవడానికి.. అలాగే విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇవ్వడానికి, పొరుగు సేవల విధానంలో ఈ కంప్యూటర్ టీచర్లను నియమించనున్నారు. త్వరలో తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ (TGTS) ద్వారా ఈ నియామక ప్రక్రియ చేపట్టడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఎంపికైన ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లకు ప్రభుత్వం గౌరవ వేతనంగా నెలకు రూ. 15,000 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. ఈ వేతనాన్ని ఏడాదిలో పది నెలలపాటు చెల్లిస్తారు. ఈ ఖర్చును సమగ్ర శిక్షా నిధుల నుంచి వినియోగించనున్నారు.

# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరిన మంత్రి పొన్నం ప్రభాకర్.. సిద్ధమా..?



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా యూసుఫ్‌గూడలో ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రకాష్ భాకర్.. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మా అభ్యర్థి యువకుడు, స్థానికుడు, ఉత్సాహవంతుడు అని పేర్కొన్న ఆయన, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్నప్పటికీ అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసినవారిని ప్రజలు తిరస్కరించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన అనేక సంక్షేమ పథకాల వల్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూలంగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి అభివృద్ధి సాధించినట్లే, జూబ్లీహిల్స్ ప్రజలు కూడా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో పెన్షన్లు ఇవ్వడమే అభివృద్ధి కాదని, నిజమైన అభివృద్ధి అంటే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా మార్పులు తీసుకురావడమేనని మంత్రి పొన్నం ప్రభావకర్ స్పష్టం చేశారు. తాము కేవలం రెండు నెలల్లోనే 2,500 కోట్ల రూపాయల విలువైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులు పూర్తి చేశామని తెలిపారు. దివంగత మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి పెద్దగా అభివృద్ధి చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సమస్యలను సమర్థంగా ప్రస్తావించలేకపోయారని విమర్శించారు.

## నేను ఇన్‌చార్జి కలెక్టర్‌గా వచ్చా విధుల్లో చేర్చుకోండి

### కామారెడ్డిలో నకిలీ ఐఏఎస్ హంగామా



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** నేను ఐఏఎస్ ఆఫీసర్‌ను, ఇక్కడికి ఇన్‌చార్జి కలెక్టర్‌గా వచ్చా.. విధుల్లో చేర్చుకోండి అంటూ ఓ మహిళ కామారెడ్డి కలెక్టరేట్‌లో హంగామా చేసింది. తనకు ప్రభుత్వం ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యలు అప్పగించిందంటూ అదనపు కలెక్టర్‌ను కలిసిన ఆమె ఉత్తర్వులు చూపించింది. అయితే అది నకిలీదని గుర్తించిన అధికారులు ఫోలీసులకు సమాచారం అందించారు. దీంతో నకిలీ కలెక్టర్‌ను పట్టుకుని ఆమెపై చీటింగ్ కేసు నమోదుచేశారు.

# తెలంగాణ ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం

- ✓ కొత్త మద్యం పాలసీ, పండుగలతో ఆదాయ పెరుగుదల
- ✓ దుకాణాల లైసెన్సులకు భారీ స్పందన - 95,628 దరఖాస్తులు
- ✓ ఒక్క నెలలో లైసెన్సుల ద్వారా రూ.3,180 కోట్లు
- ✓ అమ్మకాల ద్వారా రూ.3,168 కోట్ల రాబడి
- ✓ ప్రభుత్వ ఖజానాకు రూ.6,348 కోట్ల భారీ వరద
- ✓ పెండింగ్ బిల్లుల విడుదలపై ఆశలు పెరిగిన కాంట్రాక్టర్లు



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊపునిస్తూ.. ఎక్సైజ్ శాఖ రికార్డు స్థాయిలో అక్టోబర్ నెలలో ఆదాయాన్ని నమోదు చేసింది. కేవలం ఒకే ఒక్క నెలలో ఏకంగా రూ.6,348 కోట్ల భారీ ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అయింది. కొత్త మద్యం పాలసీ అమలు చేయడంతోపాటు.. అక్టోబర్ నెలలో పండుగల సీజన్ కలయికతో ఈ అద్భుతమైన వృద్ధి సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఇక ఎక్సైజ్ శాఖకు వచ్చిన ఈ మొత్తం ఆదాయంలో దాదాపు సగం వాటా కొత్త మద్యం పాలసీ మార్పుల ద్వారానే వచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు.. తెలంగాణలో మొత్తం 2,620 మద్యం దుకాణాలకు 2 ఏళ్ల కాలానికి కొత్త లైసెన్సులు ఇచ్చే ప్రక్రియలో భాగంగా దరఖాస్తులను ఆహ్వానించగా.. భారీగా స్పందన లభించింది.

గతంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఒక్కో షాప్ కోసం రూ.2 లక్షల దరఖాస్తు ఫీజు వసూలు చేసేవారు. అయితే ఈ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేవారు కాదు. అయితే ఈసారి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచింది. ఫీజును భారీగా పెంచినా.. మద్యం దుకాణాల లైసెన్సుల కోసం 95,628 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

కేవలం మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారానే ఎక్సైజ్ శాఖకు రూ.2,868.8 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు తొలి విడతలో లైసెన్స్ ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించగా.. అదనంగా మరో రూ.313 కోట్లు ప్రభుత్వానికి అందాయి. దీంతో లైసెన్సుల ప్రక్రియ ద్వారా వచ్చిన మొత్తం రూ.3,180 కోట్లు అని లెక్క తేలింది.

**పండుగల సీజన్‌లో రికార్డు అమ్మకాలు**

మరోవైపు.. అక్టోబర్ నెలలో బతుకమ్మ, దసరా వంటి వరుస పండుగలు.. జాతరలు ఉండటంతో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఇక అక్టోబర్ నెలలో మద్యం అమ్మకాల ద్వారా రూ.3,168 కోట్ల ఆదాయం తెలంగాణ ఎక్సైజ్ శాఖకు సమకూరింది. గతేడాది అక్టోబర్‌లో మద్యం అమ్మకాల ద్వారా రూ.2,987 కోట్లు రాగా.. ఈసారి ఆ రికార్డును అధిగమించడం గమనార్హం. ఈ రెండు ప్రధాన వనరుల నుంచి వచ్చిన రూ.6,348 కోట్ల భారీ ఆదాయంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ అదనపు ఆదాయం కారణంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరగా మంజూరవుతాయని మద్యం సరఫరాదారులు, కాంట్రాక్టర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో డ్రగ్, గన్ కల్చర్ కు మూలం కేటీఆరే: తుమ్మల



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో డ్రగ్, గన్ కల్చర్ కు మూలం కేటీఆరే అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్ల కోసం ఇచ్చిన వాగ్ధానాలు, మీరు పెట్టిన లక్షలాది కోట్ల బాకీల సంగతి ఏంటని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో క్యాంపెయిన్ నిర్వహించిన తుమ్మల ఈ సందర్భంగా ఓ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ బాకీ కార్డు అంటూ కేటీఆర్ చేస్తున్న ప్రచారానికి ఈ సందర్భంగా తుమ్మల కౌంటర్ ఇచ్చారు.

## సుడిగాలి బీభత్సం..

### క్షణాల్లోనే 200 చెట్లు నేల మట్టం



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** మొన్నటి వరకు మొంథా తుఫాన్ రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎడతెరపి లేని వానలతో వాగులు వంకలు పొంగి పోర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక వరంగల్ పట్టణం అయితే పూర్తిగా నీట మునిగింది. ఈ తుఫాన్ దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రైతులకు సుడిగాలి భారీ షాక్ ఇచ్చింది. ఒక్కసారిగా చెలరేగిన సుడిగాలి ధాటికి పదుల ఎకరాల్లో పంటలు నెలకొరిగాయి. చూస్తుండగానే క్షణాల వ్యవధిలో వందల చెట్లు నేల కూలాయి. మనుషులు సైతం గాలికి ఎగిరిపోతారేమో అనేంత భయంకరంగా సుడిగాలి వీచింది.

# చీమల భయంతో వివాహిత సూసైడ్

పోలీసులు గదిని పరిశీలించగా.. అక్కడ ఒక నోట్‌బుక్‌లో మృతురాలు రాసిన సూసైడ్ నోట్ లభించింది. అందులో, 'శ్రీ.. ఐయాం సారీ.. ఈ చీమలతో బ్రతకడం నావల్ల కావట్లేదు... కూతురు అన్వి జాగ్రత్త.. అన్నవరం, తిరుపతి, ఎల్లమ్మ మ్మొక్కులు తీర్చండి' అని రాసి ఉంది. ఈ సూసైడ్ నోట్ ఆమె ఫోబియా తీవ్రతను, మానసిక క్షోభను తెలియజేస్తుంది. సమాచారం అందుకున్న అమీన్‌పూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీమల ఫోబియా అంటే..?

నిజానికి, చీమలంటే భయం అనేది కేవలం మానసిక ఆందోళన మాత్రమే కాదు, అదొక క్లినికల్ ఫోబియా. చీమల ఫోబియాను శాస్త్రీయ భాషలో మైర్మెకోఫోబియా అని అంటారు. మైర్మెకోఫోబియా అనేది చీమల పట్ల లేదా చీమలు కుట్టడం పట్ల విపరీతమైన భయం కలిగి ఉండటం. ఈ భయం చీమలను చూసినప్పుడు మాత్రమే కాకుండా.. వాటి గురించి ఆలోచించినప్పుడు లేదా వాటి గురించి మాట్లాడినప్పుడు కూడా తలెత్తవచ్చునని మానసిక నిపుణులు చెబుతున్నారు.

మైర్మెకోఫోబియాతో బాధపడేవారు గుండె వేగంగా కొట్టుకోవడం, విపరీతమైన చెమట పట్టడం, వణుకు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అదుపు కోల్పోతామనే భయం వంటి తీవ్రమైన పానిక్ అటాక్ లక్షణాలను అనుభవిస్తారు. దాని ద్వారా కలిగే తీవ్రమైన మానసిక వేదన, ఒంటరితనం, జీవిత నాణ్యత తగ్గడం వంటి అంశాలు తీవ్ర డిప్రెషన్‌కు దారి తీస్తాయి. ఒక వ్యక్తికి రోజూ ఎదురయ్యే వస్తువు పట్ల విపరీతమైన భయం ఉంటే.. వారు నిరంతరం ఆందోళనలో గడుపుతారు. ఫోబియా తీవ్రతరం అయినప్పుడు.. ఆ వ్యక్తి ఈ నిరంతర భయం నుంచి బయటపడటానికి ఆత్మహత్యే ఏకైక మార్గమని భావించే ప్రమాదం ఉంది. మనీషా విషయంలో కూడా.. తన భయం ఆమెను జీవించడానికి వీలు లేని విధంగా బాధించినట్లుగా తెలియజేస్తుందని అంటున్నారు. మానసిక ఆరోగ్యం, ఫోబియాలకు చికిత్స ఎంత అవసరమో ఈ విషాదకర ఘటన మరోసారి గుర్తు చేసింది.

# ప్రభుత్వ స్కూళ్లలో 2,837 ఉద్యోగాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇరవై ఏళ్ల క్రితం సుమారు 4,200 పాఠశాలల్లో కంప్యూటర్లు సమకూర్చారు. అప్పట్లో ఐదేళ్ల కాలపరిమితికి కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. అయితే వారిని తొలగించిన తర్వాత సరైన పర్యవేక్షణ లేక కంప్యూటర్ ల్యాబ్‌లు నిరుపయోగంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా నియమించబోయే బోధకులు ల్యాబ్‌ల నిర్వహణతో పాటు, విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యతను అందించడంలో కీలక పాత్ర పోషించనున్నారు.

విద్యా శాఖ ఇటీవల చేపట్టిన పలు డిజిటల్ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు కూడా ఈ టీచర్ల నియామకం చాలా అవసరం. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలనే లక్ష్యంతో విద్యాశాఖ.. బెంగళూరుకు చెందిన ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారంతో గత ఏడాది ఫిబ్రవరి నుంచి 1,354 పాఠశాలల్లో 'అసిస్టెడ్ లాంగ్వేజ్ అండ్ మ్యాథ్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్'ను అమలు చేస్తోంది. అంతేకాకుండా, ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఆన్‌లైన్ విధానంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు గణితం, సైన్స్ పాఠాలు సులువుగా అర్థమయ్యేలా 'ఖాన్ అకాడమీ' తరగతులను కూడా ప్రారంభించారు. ఈ ఆన్‌లైన్, అసిస్టెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు విజయవంతం కావాలంటే, కంప్యూటర్లపై, సాఫ్ట్‌వేర్‌లపై పూర్తి అవగాహన ఉన్న బోధకులు తప్పనిసరి. ఈ కొత్త నియామకాలతో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యకు కొత్త ఊపు రానుంది.

# రాష్ట్రంలో డ్రగ్, గన్ కల్చర్ కు మూలం కేటీఆరే: తుమ్మల

**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో డ్రగ్, గన్ కల్చర్ కు మూలం కేటీఆరే అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్ల కోసం ఇచ్చిన వాగ్దానాలు, మీరు పెట్టిన లక్షలాది కోట్ల బాకీల సంగతి ఏంటని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో క్యాంపెయిన్ నిర్వహించిన తుమ్మల ఈ సందర్భంగా ఓ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ బాకీ కార్డు అంటూ కేటీఆర్ చేస్తున్న ప్రచారానికి ఈ సందర్భంగా తుమ్మల కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వారిచ్చిన వాగ్ధానాలు అసలు నెరవేర్చలేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బంది కరంగా ఉన్నా గడిచిన 20 నెలలుగా రేవంత్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు గుర్తుపెట్టుకోవాలన్నారు. పదేళ్ల పాలన చూసిన ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్?కు బుద్ధి చెప్పారని అలాంటి వారికి కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రేవంత్ రెడ్డి పెట్టే ఇబ్బందుల కారణంగానే పారిశ్రామిక వేత్తలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోతున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తుమ్మల ఖండించారు. పారిశ్రామిక వేత్తలు రోజుకొకరు పెట్టుబడుల కోసం ఇక్కడికి వస్తున్నారని చెప్పారు.

# నల్లగొండ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** నల్లగొండ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులపై రెండో సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఈ నెల 4న చోటుచేసుకుంది. గత నెల 31వ తేదీన హాస్టల్‌లోనే రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఆ ఘటన తర్వాత బాధిత విద్యార్థులు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్ పెద్దగా స్పందించలేదని విద్యార్థులు ఆరోపించారు. తమపై ఫిర్యాదు చేసినందుకు ఆగ్రహించిన రెండో సంవత్సరం విద్యార్థులు నవంబర్ 4న మళ్లీ ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ఈ ఘటనతో కాలేజీలో భయాందోళనలు నెలకొన్నాయి. విద్యార్థులు ర్యాగింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా విచారణ జరపాలని కోరుతున్నారు.

# లివ్‌ఇన్ రిలేషన్ డ్రగ్స్ తీసుకున్న జంట ఓవర్ డోస్‌తో యువకుడు మృతి

**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** డ్రగ్స్ ఓవర్ డోస్ తో వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్‌లో చోటు చేసుకుంది. పాత బస్తీ కాళాపత్తర్ కు చెంది అహ్మద్ కర్నూలు జిల్లాకు చెందిన ఓ యువతి శివరాంపల్లి కెన్ వర్త్ అపార్ట్మెంట్ లో కో రిలేషన్ లో ఉంటున్నారు. రాత్రి డ్రగ్స్ కొనుగోలు చేసి రూమ్ లో సేవించారు. అహ్మద్ మృతి చెందాడు. యువతి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. యువతిని ఆసుపత్రికి తరలించారు. రూమ్ లో నలుగురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కోల్‌కతాకు చెందిన యువతి, కర్నూల్ కు చెందిన మరో యువతితో పాటు అహ్మద్ అతని స్నేహితుడు ఉంటున్నట్లు తెలిపారు. అహ్మద్ కి డ్రగ్స్ ఓవర్ డోస్ తో రక్త స్రావం అయ్యింది.. బయపడిన స్నేహితుడు 108 కి కాల్ చేసింది. 108 సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసి కోల్‌కతాకు చెందిన పారిపోయింది. యువతిని వెంబడించి పట్టుకున్నారు. ముగ్గరికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది.

# బీజాపూర్ ఎన్‌కౌంటర్.. మరో నలుగురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మావోయిస్టులు, పోలీసుల ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. బీజాపూర్ జిల్లా తార్లగూడెం పరిధిలోని అన్నారం-మారిమళ్ల అడవుల్లో భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నది. బుధవారం ఇదే ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం ఉదయం జరిగిన కాల్పుల్లో మరో నలుగురు మావోయిస్టులు చనిపోయారు.

ఆరు నెలలపాటు ఆయుధాలు పట్టేది లేదని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించిన 48 గంటల్లోపే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో బుధవారం ఎదురుకాల్పుల ఘటన చోటుచేసుకోవడం, రెండు రోజుల వ్యవధిలోనే ఏడుగురు మావోయిస్టులు మృతిచెందడం గమనార్హం.

# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరిన మంత్రి పొన్నం ప్రభాకర్.. సిద్ధమా..?

భవిష్యత్తులో జూబ్లీహిల్స్‌కు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ గూఢ ఒప్పందం చేసుకున్నాయనే ఆరోపణలు చేస్తూ.. "పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కిషన్ రెడ్డికి సహకరించింది. అందుకే ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గురుదక్షిణగా బీజేపీ అభ్యర్థిని బీఆర్ఎస్‌కు తాకట్టు పెట్టారు," అని వ్యాఖ్యానించారు.

కేంద్ర మంత్రి కిషన్‌కి మరోసారి సవాల్ విసిరారు మంత్రి పొన్నం ప్రభాకర్.."పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కిషన్ రెడ్డికి సహకరించింది.. అందుకే ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గురుదక్షిణగా బీజేపీ అభ్యర్థిని బీఆర్ఎస్ కు తాకట్టు పెట్టాడు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసిన అభ్యర్థికి 25వేల ఓట్లు.. ఇప్పుడు కూడా ఈ ఉప ఎన్నికలో 25 వేలకు ఒక్క ఓటు తగ్గకుండా తీసుకువస్తే మీరేం చెబితే దానికి నేను సిద్ధం.. 25 వేల ఓట్లు బిజెపి అభ్యర్థికి రాకపోతే నేనేం చెప్తే దానికి కిషన్ రెడ్డి సిద్ధమా.. ఈ ఉప ఎన్నికలో పదివేలలోపే బీజేపీకి ఓట్లు వస్తాయని నేను చెబుతున్నాను. మీ ప్రచారం సరళి చూసిన ప్రజలు మీ సొంత ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా బీఆర్ఎస్ కి మీరు లొంగిపోయారని అంటున్నారు.. బీజేపీ, బీఆర్ఎస్ లో మీ ఓటు ఎటు వేసిన సరే అనే ప్రవర్తన కనిపిస్తుందని ప్రజలే అంటున్నారు.. మీరు కేంద్ర మంత్రిగా ఉన్నారు.. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నారు.. ఈ శాసనసభ నియోజకవర్గంలో కూడా మీ పార్లమెంట్ పరిధిలోకే వస్తది.. మరి నా ఛాలెంజ్ కు కిషన్ రెడ్డి సిద్ధమా..?" అని సవాల్ విసిరారు.

# నేను ఇన్‌చార్జి కలెక్టర్‌గా వచ్చా విధుల్లో చేర్చుకోండి కామారెడ్డిలో నకిలీ ఐఏఎస్ హంగామా

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఈ నెల 2 నుంచి సెలవులో ఉన్నారు. దీంతో నిజామాబాద్ కలెక్టర్‌కు ప్రభుత్వం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. అయితే గత మంగళవారం (నవంబర్ 4న) హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన ఇస్రత్ జహన్ అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చింది. నేరుగా కలెక్టర్ చాంబర్‌కు వెళ్లిన ఆమె.. తాను ఐఏఎస్‌నంటూ పరిచయం చేసుకున్నది. సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌లో కమిషనర్‌గా పనిచేస్తున్నానని, ఆశిష్ సాంగ్వాన్ స్థానంలో ఇన్‌చార్జి కలెక్టర్‌గా తనను ప్రభుత్వం నియమించిందని ఉత్తర్వులను చూపింది. దీంతో అక్కడి అధికారులు ఆ పత్రాలను అదనపు కలెక్టర్ మధుమోహన్‌కు పంపించారు. దానిని ప్రభుత్వ పరిశీలనకు పంపిన తర్వాత నిర్ణయం చెబుతామని ఆయన తెలిపారు. అప్పటివరకు చాంబర్‌లో కూర్చున్న ఆమె వెంటనే వెళ్లిపోవడంతో ఏడీసీకి అనుమానం వచ్చింది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు.

సీసీ ఫుటేజీని పరిశీలించిన దేవునిపల్లి పోలీసులు ఆ మహిళను తూప్రాన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ జరిపారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ రాష్ట్ర కమిషనరేట్ నుంచి తనకు నియామకపత్రం వచ్చిందని చెప్పినట్లు తెలిపారు. అయితే 2020 నుంచి గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్నదని, తనకు ఉద్యోగం వచ్చినట్లు కుటుంబ సభ్యులను నమ్మించేందుకే ఇలా చేసినట్లు వెల్లడించారు. విచారణ కొనసాగుతున్నదని, ఆమెపై చీటింగ్, ఫోర్జరీ కేసులను నమోదు చేసినట్లు చెప్పారు.

# తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం..

## విజయ డెయిరీ మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య కన్నుమూత

**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విజయ డెయిరీ మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య (93) గురువారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన తుది శ్వాస విడిచారు. అయితే, జానకిరామయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) చైర్మన్‌గా 27 ఏళ్ల పాటు సుదీర్ఘంగా పని చేశారు. పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు సేవలందించడం, విజయ డెయిరీ విస్తరణకు చేసిన కృషి అసామాన్యం. పాడి పరిశ్రమకు గాను ఆయన చేసిన కృషికి డాక్టర్ కురియన్ అవార్డు లభించింది. మండవ జానకిరామయ్య మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తమ సంతాపాన్ని తెలిపారు.

# సుడిగాలి బీభత్సం.. క్షణాల్లోనే 200 చెట్లు నేల మట్టం



దీంతో పొలాల్లో పని చేస్తున్న వారు, ఆరు బయట ఉన్న వారు చెట్లను పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ సంఘటన మంగళవారం నాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వెలుగు చూడగా ఆలస్యంగా తెలిసింది.

గోదావరి పరివాహక ప్రాంతంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల మండలం ఉన్న లెంకలగడ్డ గ్రామానికి సమీపంలో సుడిగాలి బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా గాలులు సుడులు తిరిగడమే కాక.. చూస్తుండగానే వాటర్ స్పౌట్ ఏర్పడటంతో.. అక్కడున్న వారు దానిలో చిక్కుకుపోయారు. కళ్ల ముందే క్షణాల వ్యవధిలోనే పచ్చని చెట్లు, పంటలు నేలకొరిగాయి. అక్కడే ఉన్న జనాలు చెట్లను పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో.. పొలాల్లో ఉన్న రైతులు.. త్వరగా పనులు ముగించుకుని ఇంటి బాట పట్టారు. అయితే అదే సమయంలో గోదావరిలో ఏర్పడిన సుడిగుండం.. సుమారు 60 మీటర్ల వెడల్పుతో ఆకాశాన్ని తాకుతూ 5 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేసింది. ఇలా ఏర్పడిన నీటి సుడిగుండం(వాటర్ స్పౌట్)లో పలువురు చిక్కుకున్నారు. ప్రాణ భయంతో కేకలేసినా లాభం లేకపోయింది. అలా ఆ నీటి సుడిగుండం వారిని కొంత దూరం మేర లాక్కెల్లింది. ఈక్రమంలో వారు తమకు దారిలో అడ్డువచ్చిన చెట్లను పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. సుడిగాలి తీవ్రత తగ్గాక వారంతా ఇళ్లకు చేరుకున్నారు.

మంగళవారం రాత్రి ఇంటికి చేరుకున్న రైతులు.. బుధవారం ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పారు. దీంతో అందరు కలిసి పొలాల దగ్గరకెళ్లి పరిశీలించారు. ఈ సుడిగాలి దెబ్బలకు మోటార్లను తరలిస్తున్న ఎద్దుల బండి కూడా కొట్టుకుపోయిందని.. అదృష్టవశాత్తు ఎడ్లు తప్పించుకోగా బండిలో ఉన్న పనిముట్లు గాల్లో ఎగిరిపోయాయని రైతులు తెలిపారు. సుమారు 10 ఎకరాల్లో పత్తి , మిరప తోటలు నేలకొరిగాయని చెప్పుకొచ్చారు.

200 చెట్లు నేలమట్టం

ఈ వాటర్ స్పౌట్ ప్రభావంతో రాళ్లవాగు వెంబడి అటవీ ప్రాంతంలో చెట్లు నేలకొరిగాయి. అడవిలో భూమి చాలా లూజుగా ఉండటంతో.. చాలా చోట చెట్లు వేళ్లతో సహా కూలిపోయాయి. భూమి గట్టిగా ఉన్న ప్రాంతంలో మాత్రం కొమ్మలు వాలిపోయాయి ఈ సుడిగాలి ధాటికి.. కిలోమీటర్ల వరకు 200 చెట్లు నేలమట్టం అయినట్లు స్థానికులు తెలిపారు. గోదావరిలో ఏర్పడిన నీటి సుడిగుండం.. లెంకలగడ్డ అటవీప్రాంతం నుంచి మహాముత్తారం అడవుల వైపు వెళ్లిందని అధికారులు తెలిపారు.

# తెలంగాణ భక్తులకు తిరుమల దేవస్థానం శుభవార్త..

## ఈ మూడు పట్టణాల్లో టీటీడీ ఆలయాలు

**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు గుడ్‌న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మూడు టీటీడీ దేవాలయాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. టీటీడీ చైర్మన్‌గా తమ పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. తిరుమల కొండపై కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ పవిత్రతను, సేవా ప్రమాణాలను మరింత మెరుగుపరచడానికి బోర్డు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. టీటీడీ ఆధ్వర్యంలో త్వరలోనే తెలంగాణలోని కరీంనగర్, దుబ్బాక, మంథని ప్రాంతాలలో కొత్త ఆలయాలను నిర్మించనున్నట్లు బీఆర్ నాయుడు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల ప్రసిద్ధ లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచినట్లు వెల్లడించారు. ప్రస్తుతం లడ్డూలు 10 రోజుల వరకు తాజాగా, వాసన రహితంగా ఉంటున్నాయని భక్తులు చెబుతున్నారన్నారు. భక్తులకు శుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడానికి, అన్నప్రసాదం తయారీలో అత్యుత్తమ నాణ్యత గల పదార్థాలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. స్థానికులకు మరింత మెరుగ్గా సేవ చేయడానికి, ప్రతి నెల మొదటి మంగళవారం రోజున 3 వేల మంది తిరుపతి స్థానికుల కోసం ప్రత్యేక దర్శనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పటివరకు వ్యక్తుల పేరు మీద ఉన్న కాటేజీలకు ఆ పద్ధతిని నిలిపివేశామని, ఇకపై కాటేజీలకు దేవతామూర్తుల పేర్లు పెడతామని నాయుడు పేర్కొన్నారు. టీటీడీ కొనుగోళ్ల విభాగంలో జరిగిన అవకతవకలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. తప్పు చేసినట్లు తేలితే, ఎవరినీ ఉపేక్షించకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుపతి విమానాశ్రయం పేరును శ్రీ వెంకటేశ్వర విమానాశ్రయంగా మార్చడంపై త్వరలో కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందని నాయుడు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు రద్దు అవుతుందనే ఊహాగానాలను ఆయన ఖండించారు. ట్రస్టును రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

తిరుమల, ఒంటిమిట్ట ప్రాంతాలలో ఔషధ, పవిత్ర వనాలను అభివృద్ధి చేయాలని టీటీడీ యోచిస్తోందన్నారు. ఇది ఆలయ సంప్రదాయ, పర్యావరణ వారసత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.

# చేవెళ్ల ఘటనతో రవాణా శాఖ అలర్ట్.. త్రిముఖ వ్యూహంతో కొత్త రూల్స్..!

**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాపూర్ వద్ద మూడ్రోజుల క్రితం ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టిన ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా దిగ్భ్రాంతిని గురి చేసింది. రోడ్డు ప్రమాదాలు, డ్రైవర్ల నిర్లక్ష్యంపై చర్చకు దారి తీసింది. దీంతో ప్రమాదాల నియంత్రణపై తెలంగాణ రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో జరిగిన ఘోర ప్రమాదాలను క్షుణ్ణంగా విశ్లేషించిన అధికారులు.. వాటిని కట్టడి చేసేందుకు త్రిముఖ వ్యూహాన్ని అమలు చేయాలని నిర్ణయించారు.

ఈ వ్యూహంలో భాగంగా.. మొదటి దశలో ప్రైవేటు బస్సులు, లారీల వంటి భారీ వాహనాల వల్ల జరిగే ప్రమాదాల కట్టడికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటివరకు వాహన ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం డ్రైవర్‌పైనే కేసులు నమోదు చేసే నిబంధన ఉంది. అయితే ఈ విధానంలో కీలక మార్పులు తీసుకురావాలని రవాణా శాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇకపై ప్రమాదాలకు కారణమయ్యే వాహనాల యజమానిపైనా కేసు నమోదు చేయాలని కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో దాదాపు 1.77 కోట్లకు పైగా వాహనాలు ఉండగా.. లారీలు, టిప్పర్ల వంటి గూడ్సు వాహనాలు 6.68 లక్షలు ఉన్నాయి. రవాణా శాఖ నిర్వహించిన సమీక్షల్లో ఎల్లో నంబర్ ప్లేట్‌తో తిరిగే గూడ్స్ వాహనాల ద్వారా ఆర్థిక లబ్ధి పొందేది యజమానులే కాబట్టి.. ప్రమాదాలకు వారిని కూడా బాధ్యులను చేయాలని నిర్ణయించారు.

కంపెనీల నిబంధనలకు విరుద్ధంగా వాహనాల బాడీలను మార్చడం, ప్రైవేటు బస్సుల్లో సీట్లు/బెర్తుల సంఖ్యను పెంచడం, నడిచేందుకు తగినంత స్థలం లేకుండా చేయడం, ఎమర్జెన్సీ డోర్లు సరిగా లేకపోవడం, వాహనంలో ఏర్పాటు చేసిన స్పీడ్ లిమిట్ పరికరం పనిచేయకుండా చేయించడం, రెగ్యులర్ డ్రైవర్లు లేనప్పుడు అవగాహన లేని తాత్కాలిక డ్రైవర్లకు వాహనాలను అప్పగించడం, డ్రైవర్లకు సరైన విశ్రాంతి ఇవ్వకపోవటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న రవాణా శాఖ.. యజమానిని బాధ్యుడిని చేస్తే వారు డ్రైవర్ల ఎంపిక, వాహనాల నిర్వహణ, డ్రైవర్ల విశ్రాంతి వంటి విషయాల్లో ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారని భావిస్తోంది.

రవాణా శాఖ ఈ కార్యాచరణ కోసం వాహనాలను మూడు రకాలుగా వర్గీకరించింది. ప్రైవేట్ బస్సులు, లారీల వంటి భారీ వాహనాలను మ్మొదటి కేటగిరీలో.. ఎల్లో నంబర్ ప్లేట్ ఉన్న కార్లు రెండో కేటగిరీలో.. ఇతర వాహనాలు మూడో కేటగిరిలో చేర్చారు. అంతేకాకుండా పదేపదే ప్రమాదాలు చేస్తున్న డ్రైవర్లకు, అలాగే టెక్నాలజీ, సేఫ్టీ నిబంధనలపై అవగాహన తక్కువగా ఉన్న డ్రైవర్లకు పునశ్చరణ తరగతులు నిర్వహించే అంశంపై చర్చించింది. భారీ వాహనాల డ్రైవర్లకు ఈ శిక్షణ అవసరమైనప్పటికీ.. యజమానులు దీనిని పట్టించుకోవడం లేదని గుర్తించారు. ఆర్టీసీ ఇటీవలే ఎక్కువ ప్రమాదాలు చేసే డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. రవాణా శాఖ కూడా ఈ తరహా శిక్షణను తప్పనిసరి చేయాలని యోచిస్తోంది.

# గాంధీ ఆసుపత్రిలో తెలంగాణ మానవ హక్కుల కమిషన్ బృందం పరిశీలన



**న్యూస్ డెస్క్ , 06 నవంబర్ (కెరటం న్యూస్):** దిమానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993 లోని సెక్షన్ 12 (సి) ప్రకారం తన విధుల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ బృందం ఇవాళ (గురువారం) మధ్యాహ్నం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిని సందర్శించింది. ఈ సందర్శనలో కమిషన్ ఛైర్పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అఖ్తర్, కమిషన్ సభ్యులు శివాది ప్రవీణ, (Non-Judicial) డా. బి. కిషోర్ (IAS Retd.) పాల్గొన్నారు. కమిషన్ అధికారులలో కార్యదర్శి, సీఈఓ ఏ.ఎన్. కాంతి వెస్లీ (IAS), డిప్యూటీ రిజిస్ట్రార్ -కం- PS to ఛైర్పర్సన్ బీవీఏ. విజయ్, ప్రజాసంబంధాధికారి, పరిపాలనా అధికారి పి. శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాములు తదితరులు కూడా ఈ సందర్శనలో భాగమయ్యారు. ఆసుపత్రికి విచ్చేసిన కమిషన్ బృందాన్ని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వాణి, ఇతర వైద్యులు, చిలకలగూడ ఎస్‌హెచ్ఓ, ఏసీపీలు స్వాగతించారు. కమిషన్ బృందం మొదట ఎమర్జెన్సీ వార్డును పరిశీలించి, విధుల్లో ఉన్న వైద్యులతో చర్చలు జరిపింది. అనంతరం జెరియాట్రిక్ (వయోవృద్ధుల) విభాగం, పేడియాట్రిక్ (పిల్లల) విభాగం, ముఖ్యంగా పేడియాట్రిక్ సర్జరీ విభాగం, ఇతర విభాగాలను సందర్శించి, సంబంధిత రికార్డులను పరిశీలించింది. తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అఖ్తర్ ఆసుపత్రి సందర్శన ఉద్దేశ్యాన్ని వివరించారు. పరిశీలించిన విభాగాలపై వివరాలు తెలియజేసి, పేడియాట్రిక్ సర్జరీ విభాగంలో జరుగుతున్న విశిష్టమైన సేవలను అభినందించారు.

## మత్కేపల్లి ప్రాంతంలో నూతన వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం



చింతకాని, 06 నవంబర్ (కెరటం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆశయాలు, మార్గదర్శకత్వం మేరకు మత్కేపల్లి ప్రాంతంలో నూతన వ్యవసాయ మార్కెట్ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ వేగంగా కొనసా గుతోంది. ఈ కార్య క్రమంలో భాగంగా, రెవెన్యూ మరియు మార్కెటింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా స్థలం పరిశీలించి గుర్తింపు పూర్తి చేశారు. అనంతరం రెవెన్యూ అధికారుల నుండి మార్కెటింగ్ అధికారులు స్థల స్వాధీన ప్రక్రియను ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు స్థలం యొక్క పత్రాలను మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావుకి అందజేశారు. ఈ నూతన మార్కెట్ చింతకాని ముదిగొండ మండలాల రైతుల ఆర్థికాభివృద్ధికి కీలక ఘట్టంగా నిలుస్తుందని మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండలం ఎమ్మార్వో బాబ్జి ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం ఏ అలిమ్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పరసగాని తిరుపతిరావు గారు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు మార్కెట్ పాలకవర్గ సభ్యులు, మత్కేపల్లి, జగన్నాధపురం గ్రామాల పంచాయతీ సెక్రటరీలు మరియు జిపిఓ లు పాల్గొన్నారు.

## ఖమ్మం మార్కెట్ ఆధునీకరణ పనులను పరిశీలించిన నల్లగొండ బృందం





ఖమ్మం వ్యవసాయం, 06 నవంబర్ (కెరటం న్యూస్): ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్లో అధునాతన పద్ధతుల్లో రూ.153 కోట్లకు పైగా నిధులతో నిర్మాణం జరుగుతున్న అత్యాధునిక వ్యవసాయ మార్కెట్ ను గురువారం నల్లగొండ జిల్లా ప్రతినిధి బృందం ప్రత్యేకంగా పరిశీలించింది. ఈ సందర్భంగా మార్కెట్లో జరుగుతున్న అధునాతన షెడ్లను, రైతులకు ప్రత్యేకంగా నిర్మిస్తున్న విశ్రాంతి గదుల నిర్మాణాలను, తదితర అభివృద్ధి కార్యక్రమాలను నల్గొండ జిల్లా శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పిఎసిఎస్ చైర్మన్, తదితర పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రత్యేకంగా పరిశీలించేందుకు ప్రతినిధి బృందం తరలివచ్చింది. ఇందుకు సంబంధించి కెరట న్యూస్ స్పందిస్తున్న వివరాలు ఎలా ఉన్నాయి. స్టడీ టూర్ నిమిత్తం వ్యవసాయ మార్కెట్ కమిటీ శాలిగౌరారం (నల్గొండ జిల్లా) చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ నరిగ నరసింహ పిఎసిఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, సమస్త పాలకవర్గ సభ్యులతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఖమ్మం మిర్చి మార్కెట్, పత్తి మార్కెట్ యార్డుల కార్యకలాపాలు (క్రయ విక్రయాలు) పరిశీలించి, చైర్మన్ ఎర్రగర్ల హనుమంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, డిఎంఓ అబ్దుల్ అలీమ్ తో సమావేశం అయి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఖమ్మం ఆధునిక యార్డు నిర్మాణ పనులు పరిశీలించినారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు సందడి



మధురానగర్, 06 నవంబర్ (కెరటం న్యూస్): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మధురానగర్‌లోని పోరా టవర్స్ వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నేతలు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశమై పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయం కోసం పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ ఎర్రబెల్లి దయాకర్‌రావు, అభివృద్ధి ధ్యేయంగా పనిచేసే నాయకత్వాన్ని మళ్లీ విజయం చేకూర్చాలని ప్రజలను కోరారు. మునుపటి పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేస్తూ, కాంగ్రెస్ పాలన లో ఇప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏది పూర్తిగా అమలు చెయ్యలేదని ఎగ్దేవ చేసారు. ఇప్పటి ప్రభుత్వానికి బుద్ది చెప్పాలంటే ప్రజల మద్దతు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కూడా పాల్గొన్నారు. తొర్రూర్ మండలం సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్రం రాజు, ఇదిగాని సందీప్ యాదవ్, యువ నాయకులు మరియు పలువురు పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నాయకుల ఉత్సాహం, కార్యకర్తల హోరాహోరీ నినాదాలతో ప్రచార వేదిక శక్తివంతంగా మారింది

# బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నర్సంపేటలో మౌన దీక్ష

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్

### బీసీ జెఏసి రిజర్వేషన్ల పోరాటాన్ని పల్లె పల్లెకు విస్తరింప చేస్తాం

### బీసీ జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్






నర్సంపేట, 06 నవంబర్ (కెరటం న్యూస్): వరంగల్ జిల్లా నర్సంపేటలో బీసీ జెఏసి జిల్లా వైస్ చైర్మన్ కడారి సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిసి జెఏసి మౌన దీక్ష కార్యక్రమానికి బిసి జెఏసి వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ హాజరయ్యారు. నర్సంపేట మౌన దీక్షలో డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర బిసి జెఏసి నవంబర్ 2వ తేదీన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర బిసి జెఏసి రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తో పాటు బిసి జెఏసి నాయకులు ప్రకటించిన అష్టాంగ ఆందోళనలలో భాగంగా గురువారం రోజున రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బీసీ ల మౌన దీక్షలను వరంగల్ జిల్లాలో ఎక్కడికక్కడ బిసి జెఏసి, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో పాటు మూతికి నల్ల గుడ్డలు కట్టుకుని మౌన దీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని డ్యాగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జనాభాలో 10 శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ఈ డబ్ల్యూ ఎస్ పేరుతో ఎలా ఇచ్చారని జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు మాత్రం జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించకుండా అగ్రవర్ణ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలుగా, ఓట్లు వేయించుకునే యంత్రాలుగానే వాడుకుంటున్నారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే మద్దతును ఇచ్చిన బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని లేకుంటే బీసీ ఉద్యమాన్ని పల్లే పల్లేకు విస్తరించి బిజెపికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. బీసీ జెఏసి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ రిజర్వేషన్లను సాధించే వరకు పోరాటాలు కొనసాగుతాయని అన్నారు. బిసి జెఏసి ఆధ్వర్యంలో డిసెంబర్ మొదటి వారంలో పెద్ద ఎత్తున బీసీల ఛలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి చేపడతామని, అదే విధంగా జనవరి 4వ వారంలో లక్షల మందితో వేల వృత్తులు... కోట్ల గొంతులు... అనే నినాదంతో హైదరాబాదులో మిలియన్ మార్చ్ తరహాలో భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మౌన దీక్ష కార్యక్రమానికి బీసీ కుల సంఘాలు, ఎమ్మార్పీఎస్, లంబాడి జెఏసి లు మద్దత్తు తెలిపారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్లు కడారి సురేష్ యాదవ్, కురిమిల్ల రమేష్, కో చైర్మన్లు చిలువేరు కొమ్మాలు, ఓర్సు సాంబయ్య, చెన్నారావుపేట మండల అధ్యక్షులు బర్ల యాకయ్య, దుగ్గొండి మండల జెఏసి వైస్ చైర్మన్ కానుగుల కుమారస్వామి, బీసీ మండల నాయకులు నూనె రంజిత్ ముదిరాజ్, మారపాక రమేష్ ముదిరాజ్, శీరంశెట్టి రాజేందర్ పెరక, శాలివాహన సంఘం గౌరవ అధ్యక్షులు చిలువేరు కొమురయ్య మేదర సంఘం జిల్లా నాయకులు శేర్ల శ్రీనివాస్, నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గొలనకొండ రవీందర్, ఉపాధ్యక్షుడు సూత్రపు సాంబయ్య, వల్లాజి సురేష్ కుమార్, కార్యదర్శి మొగిలిచర్ల రవీందర్, లంబాడి జెఏసి నాయకులు గుగులోతు కిషన్ నాయక్, జాటోతు బాలు నాయక్, భూక్య హరి ఎమ్మార్పీఎస్ నాయకులు నిరంజన్ మునిగే యాకూబ్, మాదాసి బాబు, గుండేటి వీరేష్ లంబాడి జెఏసి నాయకులు గుగులోతు కిషన్ నాయక్ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కల్వచర్ల సత్యనారాయణ, మారేడుగొండ బ్రహ్మాచారి, వడ్డెర సంఘం నాయకులు ఆలకుంట నాగులు బొంత శివ, బీసీ నాయకులు పాలడుగుల రాజేందర్, మేడి సంతోష్, మొర్రి కట్టయ్య బీసీ సంఘం నాయకులు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద బీ.సీ జే.ఏ.సీ జిల్లా కన్వీనర్ భద్ర బోయిన సైదులు. ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం





సూర్యాపేట, 06 నవంబర్ (కెరటం న్యూస్): గత 22 నెలలుగా, ఈ రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రైవేట్ యాజమాన్యాల కళాశాలలో, ఇంజనీరింగ్, న్యాయవిద్య, నర్సింగ్,పాలిటెక్నిక్, బి.ఎడ్,డిగ్రీ,పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎం.బీ.ఏ కోర్సులు నడుస్తున్నాయి. వీటిల్లో లక్షలాదిమంది విద్యార్థులు చదువుకుంటున్న, వీటికి సంబంధించిన ట్యూషన్ ఫీజు గత రెండు సంవత్సరాలుగా, దాదాపు 12,000 కోట్ల రూపాయలు బకాయిలు ప్రభుత్వం, యాజమాన్యాలకు చెల్లించవలసి ఉన్నది . నిర్వహణ ఖర్చులు భరించలేక సిబ్బంది జీతభత్యాలు చెల్లించలేక విధిలేని పరిస్థితులలో, ప్రైవేటు యాజమాన్యాలు ప్రభుత్వంపై ప్రత్యక్ష చర్యకు తలపడుతున్నాయి. విద్యార్థుల విషయంలో ఈ ప్రభుత్వం మరింత క్రూరంగా వ్యవహరిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు, ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుండా, వారిని విద్యకు దూరం చేయాలనే, చూస్తున్నది. ఖజానాలో డబ్బులు లేవని బుకాయిస్తున్నది, మూడు లక్షల ఆదాయం ఉన్నవారికి ఫీజు రీఎంబర్స్మెంట్ చేస్తామని. ఇచ్చిన మాట బూటకమేనా ఈ విషయంలో, ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన,ట్లు వ్యవహరిస్తున్నది 13 లక్షల మంది విద్యార్థుల, ఫీజు పెండింగ్ ఉండటం వల్ల, వారి భవిష్యత్తు ప్రమాదంలో పడిందని డబ్బు లేదని డిప్యూటీ సీఎం చెప్పడం హాస్యాస్పదంగా, అనిపిస్తా ఉన్నది. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు, ప్రభుత్వం బాకీ పడింది, యాజమాన్యాలు నేల క్రితం సెమిస్టర్ పరీక్షలు బహిష్కరిస్తామని బెదిరిస్తే, ప్రభుత్వం చర్చలకు దిగివచ్చి వారిని బుజ్జగించే ప్రయత్నం చేసింది, చర్చలు జరిపిన అనంతరం ప్రభుత్వం 1200 కోట్లకు టోకెన్లు ఇచ్చింది. కానీ దీపావళి నాటికి 300 కోట్లు మాత్రమే విడుదల చేసి తన అలవాటుగా, వాగ్దాన బంగానికి పాల్పడింది. అని వెంటనే ఈ ప్రభుత్వం నిజంగా విద్యార్థులపై చిత్తశుద్ధి ఉంటే,తక్షణమే ఆయా యాజమాన్యాలు,అడిగేటటువంటి 5000 కోట్ల రూపాయలను, వెంటనే విడుదల చేసి వారి యొక్క భవిష్యత్తు తరాలకు, దోహదపడాలని ఈ సందర్భంగా తెలియజేస్తామని, ఎట్టి పరిస్థితులలో ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేసేంతవరకు, విద్యార్థుల పక్షాన, సూర్యాపేట బీ.సీ జే.ఏ.సీ నిరంతరం పోరాటం, చేస్తదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.సి జే.ఏ.సీ జిల్లా నాయకులు బై రోజు మదనాచారి, మట్టి పెల్లి నాగరాజ్ యాదవ్, కక్కిరేణి నాగేంద్రబాబు, యోగి శ్యాం కుమార్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు

# అయ్యప్ప మాల వేస్తే పాఠశాలకు నో ఎంట్రీ

### ఆరోపిస్తూ పాఠశాల ఎదుట ధర్నా




సూర్యాపేట, 06 నవంబర్ (కెరటం న్యూస్): అయ్యప్ప మాల వేస్తే పాఠశాలకు రావద్దంటూ, అయ్యప్ప స్వామి మాల ధరించిన విద్యార్థినీ, ఆ పాఠశాల ప్రిన్సిపాల్, కొట్టిందని, ఆరోపిస్తూ, పాఠశాల ముందు ధర్నా చేసిన ఘటన గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. విద్యార్థి సంఘాలు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లా కేంద్రంలోని ఆనంద్ విద్యా మందిర్(AVM స్కూల్)లో 9వ తరగతి చదువుతున్న, స్వామి మాల ధరించిన మహేష్ అనే విద్యార్థి నీ, నీ సోషల్ క్లాస్ జరుగుతుండగా, పాఠశాల హెడ్ మాస్టర్ కొట్టారని, స్వామి మాల ధరించి ఉండడం, వల్లే పాఠశాల హెడ్ మాస్టర్ కొట్టిందని, పాఠశాల ముందు బజరంగ్ దళ్ స్టూడెంట్ యూనియన్, అయ్యప్ప స్వామి మాలలు ధరించిన స్వాములు, కొద్దిసేపు పాఠశాల ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ స్టూడెంట్ యూనియన్, మాల ధరించిన స్వాములు మాట్లాడుతూ,మాల ధరించడం వల్లనే ఉద్దేశపూర్వకంగా టీచర్ కొట్టిందని ఆరోపించారు. గతంలో కూడా ఈ ప్రిన్సిపాల్ కంకణాలు కట్టుకున్న విద్యార్థులను వేధించిందని, తెలిపారు. ఈ ప్రిన్సిపాల్ పై సంబంధిత శాఖలు చర్యలు, తీసుకోవాలని కోరారు. జరిగిన సంఘటనపై పోలీస్ స్టేషన్, లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయంపై స్కూల్ ప్రిన్సిపాల్ స్పందిస్తూ.మా స్కూల్లో 80% హిందూ మతస్థులే, ఉన్నారని మేము ఇంతవరకు ఎవరినీ కూడా ఏమీ అనలేదని తెలిపారు. మహేష్ అనే విద్యార్థి క్రమశిక్షణ రహితంగా ఉంటాడని ఇప్పటికే వాళ్ళ తల్లిదండ్రులకు పలుసార్లు, తెలియజేశామని తెలిపారు. క్రమశిక్షణ లేకుండా క్లాసులు వినకుండా అల్లరి చేస్తుండడంతో, మందలించానని అన్నారు. స్వామి మాల ధరించడం వల్ల మేము మందలించ లేదని గతం నుంచి కూడా ఆ విద్యార్థి అల్లరి చేస్తూ మిగతా విద్యార్థులను, ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తెలిపారు. మాల ధరించిన స్వాముల ను మేము పాఠశాలకు రావద్దు అన్న మాట వాస్తవం కాదని తెలిపారు.

## మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లకు ఈడీ షాక్.. బెట్టింగ్ యాప్ కేసులో ఆస్తులు అటాచ్..!



స్పోర్ట్స్ న్యూస్, 06 నవంబర్ (కెరటం న్యూస్): భారత మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. బెట్టింగ్ యాప్ కేసులో ఇద్దరికి చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ సైట్ వన్ ఎక్స్‌బెట్ కు సంబంధించిన కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల విలువైన స్థిరాస్తిని, రూ.6.64 కోట్ల విలువైన రైనా మ్యూచువల్ ఫండ్స్‌ను జప్తు చేసేందుకు ఈడీ తాత్కాలిక ఉత్తర్వు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లను ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నించింది. దర్యాప్తు సమయంలో వారి వాంగ్మూలాలు నమోదు చేసింది. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన పలు కేసులను ఈడీ ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నది. ఇలాంటి బెట్టింగ్ యాప్స్ చట్టవిరుద్ధం మాత్రమే కాకుండా పెద్ద ఎత్తున మనీలాండరింగ్‌కు దోహదపడుతాయని కేంద్ర దర్యాప్తు సంస్థ భావిస్తున్నది. ఈ యాప్‌లో లక్షలాది మంది వ్యక్తులు, పెట్టుబడిదారులను రూ.కోట్లు మోసం చేశాయని, పెద్ద మొత్తంలో పన్ను ఎగవేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. బెట్టింగ్స్ యాప్స్‌కు మద్దతుగా పలువురు ప్రముఖ సినీతారలు, క్రికెటర్లు ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలో కేంద్ర దర్యాప్తు సంస్థ.. ఇప్పటికే నమోదైన కేసుల ఆధారంగా రంగంలోకి విచారణ జరుపుతున్నది. ఇందులో భాగంగా పలువురు సినీ తారలు, మాజీ క్రికెటర్ల పాత్రపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఇప్పటికే పలువురు నటీనటులు, క్రికెటర్లకు నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది. వన్ ఎక్స్‌బెట్ , దాని ప్రతినిధులను బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా ఇద్దరు మాజీ క్రికెటర్లతో ఎండార్స్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లుగా ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ ఇద్దరితో పాటు ఇదే బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో గతంలో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, నటీనటులు సోనుసూద్, ఊర్వశి రౌతేలా, మిమి చక్రవర్తి, అంకుష్ హజ్రాతో పాటు పలువురిని ప్రశ్నించిన విషయం తెలిసిందే.

## రాష్ట్రపతిని కలిసిన భారత మహిళల జట్టు.. కప్‌ను ద్రౌపది ముర్ముకు అందించిన హర్మన్‌ప్రీత్..!



స్పోర్ట్స్ న్యూస్, 06 నవంబర్ (కెరటం న్యూస్): ఐసీసీ వన్డే ప్రపంచకప్ విజేత భారత మహిళల జట్టు గురువారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా చారిత్రక విజయం సాధించిన జట్టును రాష్ట్రపతి అభినందించారు. ప్రధానిని ఆయన నివాసంలో బుధవారం టీమిండియా కలిసిన విషయం తెలిసిందే. హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలోని టీమిండియా 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి టైటిల్‌ను సాధించింది. ఈ సందర్భంగా భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ భారత జట్టు జెర్సీని ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ముకు అందించారు. మహిళలు చరిత్ర సృష్టించారని, యువ తరానికి ఆదర్శంగా నిలిచారంటూ జట్టును ద్రౌపది ముర్ము అభినందించారు.

కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. తమకు ఈ టోర్నీ ప్రత్యేకమైందని తెలిపింది. టీమ్ గొప్ప విషయం ఏమిటంటే.. ఐసీసీ వరల్డ్ కప్ భారత్‌లో జరుగుతుందని తెలిసిన క్షణం నుంచి.. ఏదేమైనా దేశం కోసం ఈ ట్రోఫీని గెలుస్తామని తామంతా నిర్ణయించుకున్నామని పేర్కొంది. ఈ రోజు మా జీవితంలోని అతిపెద్ద క్షణాన్ని మీతో పంచుకోవడం అద్భుతంగా అనిపిస్తుందని.. రాష్ట్రపతి భవన్‌కు మరోసారి పిలిచినందుకు ధన్యవాదాలు తెలిపింది. ట్రోఫీని ప్రెసిడెంట్‌కు అందించడం గౌర్వంగా ఉందని హర్మన్ చెప్పింది.

# షూటింగ్ మళ్లీ షురూ..

## అనుకున్న తేదీకే విజయ్ 'జననాయగన్'




మూవీ న్యూస్, 06 నవంబర్ (కెరటం న్యూస్): తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ మళ్లీ షూటింగ్‌లో జాయిన్ అవ్వబోతున్నట్లు తెలుస్తుంది. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం జన నాయగన్ (ప్రజల నాయకుడు). ఈ సినిమాకు కార్తీ (ఖాకీ) సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం జనవరి 09న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల విజయ్ సభలో జరిగిన తొక్కిసలాటాలో 40 మందికి పైగా చనిపోవడంతో ఈ సినిమా షూటింగ్‌ను వాయిదా వేశారు. దీంతో మూవీ కూడా వాయిదా పడుతుందని అందరూ అనుకున్నారు. కానీ తాజాగా ఈ సినిమా అనుకున్న తేదీకే రాబోతుందని చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి కొత్త పోస్టర్‌ను పంచుకుంది. అలాగే ఈ సినిమా కొత్త షెడ్యూల్ కూడా ప్రారంభం అయ్యిందని త్వరలోనే విజయ్ కూడా షూటింగ్‌లో హాజరు కాబోతున్నట్లు సినీ వర్గాలు వెల్లడించాయి.

ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రోడక్షన్ ఈ మూవీని నిర్మిస్తుంది. పూజ హెగ్డేతో పాటు ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికలుగా నటిస్తున్నారు.

## ఇక స్పీకర్లు బద్దలే.. బాలకృష్ణ అఖండ 2లో లెజెండరీ సింగర్స్ ట్రాక్



మూవీ న్యూస్, 06 నవంబర్ (కెరటం న్యూస్): తెలుగుతోపాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి అఖండ 2. బాలకృష్ణ, బోయపాటి శీను కాంబోలో వస్తోన్న ఈ సీక్వెల్ ప్రాజెక్ట్ 2025 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని తెలిసిందే. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 టీజర్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది.

అఖండ ఫస్ట్ పార్ట్‌లో మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ బీజీఎం ఏ రేంజ్‌లో సినిమాకు హైలెట్‌గా నిలిచిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇక సీక్వెల్ ప్రాజెక్ట్‌లో అంతకుమించిన స్కోర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెబుతున్నాయి. కాగా మూవీ అండ్ మ్యూజిక్ లవర్స్‌కు థ్రిల్ అందించే అదిరిపోయే వార్త ఒకటి ఇప్పుడు ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది.

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న లెజెండరీ సింగర్స్‌లో టాప్‌లో ఉంటారు శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్. ఈ ఇద్దరు సింగర్స్ పాటలు దేశమంతా ఎక్కడో ఒకచోట మార్మోగుతుంటాయని తెలిసిందే. అఖండ 2 కోసం ఈ ఇద్దరు కలిసి పనిచేయబోతున్నారన్న వార్త హైప్ పెంచేస్తుంది.

నవంబర్ 7న అఖండ 2 ఫస్ట్ సింగిల్ ప్రోమోను ప్రకటించనున్నారని తెలిసిందే. నవంబర్ 9న ఫుల్ ట్రాక్‌ను లాంచ్ చేయనున్నారు. ఈ పాటను శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ పాడినట్టు థమన్ ప్రకటించడంతో ఓ వైపు పాటతోపాటు మరో సినిమాపై కూడా అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇక ఈ ఇద్దరి వాయిస్‌తో థియేటర్లలో స్పీకర్లు బద్దలు ఖాయమైపోయినట్టేనని అంటున్నారు సినీ జనాలు.